# త్యాగరాజు ప్రతిభ

ఆచార్య ద్వారం వెంకటస్వామినాయుడు

**త్యాగరాజులో నసన్య సామాన్యమైన గుణమొకటి చూడుడు తాను సంప్రదాయ సిద్ధమైన కర్ణాటక సంగీత విదుషీమణి యయ్యు, అన్య సంప్రదాయములకు జెందిన సంగీతముల వినుటయే గాక, యందలి స్వారస్యమును గ్రహించి, మనసున జీర్ణము గావించుకొని, తన సంప్రదాయముయొక్క ప్రాథమిక నియమోల్లంఘనము జేయక యౌచిత్య భంగ మేమాత్రము గాకుండ నన్య సంప్రదాయపు సంగీతమునందు గల యుత్కృష్ట భాగముల తన రచనలలో జూపజాలిన విశాల దృక్పథము గల్గిన మహా మేధావి.**

త్యాగరాజు కవి, పండితుడు, పరమ భక్తుడు,- అన్నిటికంటెను, గాయకబ్రహ్మ, వాగ్గేయకారక శిఖామణి. తన రచనలనే గాక తన్నుకూడ దైవ నామ సంకీర్తనముకే అంకితము గావించుకొన్నవాడు. తన రచనలు తన జీవితముతోబాటు క్రమ పరిణామమును జెందినవి. పోనుపోను యాతని రచనలు మిక్కిలి రసభరితములై భావ గాంభీర్యముతో నిండినవి.

ఇప్పటి యాతని రచనలు సర్వతోముఖ సుందరములు. వాటి భాషయందలి పదములు గాని, సంగీతములోని సంగతులు గాని కదపరానివి. ఆయా స్థలములనుండి, ఆయా పదములు గాని, సంగతులు గాని, రసపుష్టికి దెబ్బతగులకుండ మార్చుట సాధ్యముగాని పని. అందలి స్వరపోకడలు సరసములు, సందర్భ సహితములు; అయ్యవి సక్రమ పరిణామము గల్గినవి. సాహిత్యమో ? మహాప్రవాహము. సారఘ సార సారణి ! ! సంగీతము నందాయన చేసిన సాహిత్యపు పొదుపు అద్వితీయము. తలంచుకొలది, విన్నకొలది, విచిత్రమై, మహాశ్చర్య సంజనితమై, అనిర్వచనీయమైన ఆనంద సుధా తరంగముల మైమరపించి మనల నోలలాడించు మహత్తర శక్తి గలవి, ఆయన రచనలు.

## పండితుడు: భక్తుడు

త్యాగరాజు పండితుడు. బాల్యముననే వేదాధ్యయనమును, సంస్కృతమును నేర్చుకొనెను. అంతియ కాదు. సంగీతాభ్యాసమునకు పూర్వమే క్రమాంతముగ అధ్యయనమును, కావ్య నాటకాలంకార వ్యుత్పత్తియును - పొందెను. ఏకసంతగ్రాహియైన త్యాగరాజు పిన్ననాటనే పండితుడౌట యాశ్చర్యం గాదు. పండితుడు మాత్రమే కాదు. ఐహిక సుఖముల దూలనాడి పారమార్థిక చింతనమే కల్గియుండిన భక్తాగ్రేసరుడు.

త్యాగరాజు రచించిన కీర్తనములన్నియు భక్తి రసప్రధానములు. ఆతడు మహానుభావుడు. "సరగున పాదములకు స్వాంతమను సరోజమును సమర్పణము" జేసినవాడు; "పతిత పావనుడనే పరాత్పరుని గురించి పరమార్థమగు నిజమార్గముతోను బాడుచును సల్లాపముతో స్వర లయాది రాగముల" తెలిసినవాడు; భగవంతుని



http://www.maganti.org/

ఆ "హొయలు మీర నడలు కల్గు సరసుని-, సదా కనుల జూచుచును" పులకిత శరీరుడై, ఆనంద పయోధి నిమగ్నుడైన వాడు.

## దైవాంశ సంభూతుడు

ఇంతటి వాడయ్యు, తన్ను దానెఱుంగలేని సాధువు. ఇంకను జూడుడు:- తన కుటుంబమే వేఱు. తల్లి సీతమ్మ, తండ్రి శ్రీ రాముడు. వాతాత్మజ, సౌమిత్రి, వైనతేయ, రిపుమర్దన, ధాత, భరతాదులు సోదరులు. పరమేశ, వసిష్ట, పరాశర, నారద, శౌనక, శుక, సురపతి, గౌతమ, లంబోదర, గుహ, సనకాదులు...... ఊహుం, వీరు మాత్రమే కాదు. "ధరనిజ భాగవతాగ్రేసరు లెవరో వారెల్లరు" యాతనికి "పరమ బాంధవులు". ఇంక నెవరు కావలయును? ఆప్తులో? త్యాగరాజునకు యాప్తులెవరు? "భాగవత రామాయణ గీతాది శ్రుతి శాస్త్ర పురాణపు మర్మములన్, శివాది షణ్మతముల గూఢములన్, ముప్పది ముక్కోటి సురాంతరంగముల భావముల నెఱిగి భావ రాగలయాది సౌఖ్యముచే చిరాయువుల్గలిగి నిరవధి సుఖాత్ము" లైనవారు. ఇంక నేమి కావలయును? తన దృఢమైన మనస్సుచేత తన చుట్టు స్వర్గమునే యేర్పాటు చేసికొనినాడు, త్యాగరాజు. ఆతనినుండి వచ్చునది యమరగానము గాక ; రేది కాగలదు ? అందువలననే సామాన్య మానవుడయ్యు, త్యాగరాజు దైవాంశ సంభూతుడు.

త్యాగరాజుని సాహిత్యమున వాల్మీకి, పోతన తిక్కన మొదలైన మహాకవుల భావములు, ప్రయోగములు, పోకడలు కన్పడుతవి. అందు చక్కని, తిన్నని సూక్తులు, అందమైన యుపమలు, శ్లేషలు, మొదలైన అలంకారములు చూడవచ్చును. తెలుగు నుడికారమునకు వన్నె పెట్టే వ్యావహారిక పదప్రయోగములును గలవు. వీటి నన్నిటిని యుదహరించుటకు నాకు కాని పని. ఐనను త్యాగరాజుని గొప్ప కవితను గురించి తెలుసుకొనుట కివి చాలును.

## కీర్తన రచన

త్యాగరాజుని రచనా పద్ధతిలో ప్రాముఖ్యము గలది, కీర్తన. "కీర్తన" యను రచనా పద్ధతి త్యాగరాజు కాలమునకు బూర్వమే యున్నప్పటికి యనేక విధముల నయ్యది యాతని చేతనే "పరిపూర్ణత"ను, "సిద్ధి"ని జెందినది. అంతకంటెను విశేషమేమనగా, ఈనాడు మనకు సామాన్యముగ వినబడు "సంగతి" యను పదమునకు యాతనివల్లనే ప్రాముఖ్యముగల్గెను. రచనలలోనే "సంగతు"ల జేర్చి, నొకదాని తరువాత నొకటి క్రమాభివృద్ధి నేర్పరచి కీర్తన యొక్క రసపుష్టిని హెచ్చుచేసెను. నిజముగ, ఆ "సంగతి" యను విధము మొత్తమున సంగీతమునకే గొప్ప పురోభివృద్ధికి కారణమాయెను. ఈ "సంగతి" వేయు విధమునందు గల విచిత్రమైన శక్తి యెటువంటిదనగా సంగీతము విని యానందించగల ప్రతివాని చేతను వేరొక "సంగతి" వేయునట్లు పురికొల్పుచూ, హృదయమునందు దాగుకొని యున్న సంగీతమును పైకి వచ్చునట్లు ప్రేరేపించును.

## కవిత ద్రాక్షాపాకము

త్యాగరాజుని కవిత్వము సలలితము, దాని పోకడ సహజము, మార్గము సుగమము. తేనెలొలుకు తెనుగు మాటలతో నిండి ద్రాక్షా పాకముగ నున్నది. ఆతని సాహిత్యమునందు అచ్చటచ్చట కొంత వ్యాకరణ విషయమున ఇప్పటి పండితులు కొన్ని లోపముల జూపబోయినను, వాటి సంఖ్య యత్యల్పమగుట వలన, వాటిని లోపము లనుటకంటె స్వల్ప ప్రమాదము లనుటయే ఎక్కువ సమంజసమని నా అభిప్రాయము. ఇంకొక విషయమును సర్వదా గుర్తునం దుంచుకొన వలయును. త్యాగరాజు తన రచనలలో చాల వాటిని భక్తి పారవశ్యమున గల్గిన భావోద్రేకముననే రచించెను.

http://www.maganti.org/

## రచనలో ప్రత్యేకత

త్యాగరాజుని కీర్తనా రచనయందు ప్రత్యేకత యొకటి గలదు. శ్రీ సంగీత కళానిధి టి. వి. సుబ్బారావు గారు వేరొకచో వ్రాసినట్లు, శ్రీ త్యాగరాజు కీర్తన లన్నియు వాటి నిర్మాణ స్వరూపమును బట్టి యొక విధముననే యున్నను వాటి నడకను. రచనా స్వభావమును బట్టి యందు కొన్ని వర్ణములుగను, పదములుగను, జావళీలుగను, మరికొన్ని బిగువైన పల్లవుల వలెను గన్పట్టును. ఇట్టి రచనా శక్తి యపురూపమైనది. ఇంక, ప్రతి రచనయూ రాగ భావముతో నిండియుండును. ఏ రాగ లక్షణమేని నిర్ణయించుటకు ఆయా రాగములలోని యాతని రచనల జూచియే తీరవలయును.

"వేగలేచి నీటమునిగి భూతిబూసి వ్రేళ్ళనెంచి వెలికి శ్లాఘనీయు"లైన అవి నీతిపరులను, వేషధారి సన్యాసులను. కృత్రిమ భక్తులను త్యాగరాజు ఖండించు నప్పటి "భస్మోద్ధూళన తత్పరం ఖలుఖర:"యను ధ్వని మనకు వేమన్నను జ్ఞప్తికి తెచ్చును. సంఘసంస్కరణ, దైవచింతనము నందు వేర్వేరు మతముల వివాద పరిష్కారము, "వెతకల్గిన తాళుకొమ్మను యోదార్పు, ధైర్యోత్సాహ ప్రేరణము, విముఖులతో చేరబోకుమను సలహా—యిటులనే యెన్నియో విధముల సర్వమానవకోటికి త్యాగరాజుని సందేశము సర్వతోముఖమైనది. త్యాగరాజుని సాహిత్య రచనలలోని యనేక ముఖ్య విషయముల జెప్పియు నన్నింటికి యుదాహరణల నే నివ్వక పోవుట రసజ్ఞులు గ్రహింపలేని విషయము కాదు. ప్రతివారును నేను పైని సూచించిన విమర్శనాదృష్టితో త్యాగరాజు రచనల శ్రద్ధగా పరికించిన యొక్కొకరికి యొక్కొక విశేషము కన్పడి తీరునని నాదృఢ నమ్మకము. అదియే త్యాగరాజుని రచనా వైచిత్రి; ఆయన రచనల నామూలాగ్రముగ పఠించు ప్రయత్నమే మన యందరి విధి.

## సంగీతము అనిర్వచనీయము

త్యాగరాజుని రచనలలోగల సాహిత్యమును గురించి యెంతయైనను నిర్వచింప వచ్చును. అంతకంటెను, ఆయన రచనలలోగల సంగీతము అనిర్వచనీయమైనది. చాలభాగము అనుభవైకవేద్యము. ఆయన సంగీత రచనలలో రసపుష్టి లేనిదిలేదు. వానిలో ప్రతి సంగతియందును రస మొప్పారు చుండును. సాహిత్యమందలి భావమును సాహిత్యముకన్న నెక్కువగ సంగీతమే ప్రకటించుచూ, రసవిస్ఫూర్తి కలుగ జేయునేమో! ఏమైననూ, అందలి రసప్రభావముచేత భాష తెలియని వానికి సైతము రచనయందలి భావమును తెలియజేయు మహాశక్తి ఆయన సంగీత రచనలయందు నిస్సందేహముగ గలదు.

రచనలోని క్రమములలో నాతడు చవి చూడనిదిలేదు. ఒకేరాగమున పలుకృతులు. రాగమొక్కటి, రాగభావమును యొక్కటి, రచనా పద్ధతియు నొకటే; కాని, క్రమములు వేర్వేరు. అదియొక నిర్మిత మహాపట్టణమును బోలినది. అందనేక మార్గములు; అన్నియు రాజబాటలే. బాటలన్నియు కోటకే దారి తీయును. త్యాగరాజుని రచనలు యొక్కొక్కటి యొక్కొక మార్గమునబోవును. అన్నియు రసపుష్టియను నియతస్థలమునకే దారి తీయును. ఆపట్టణమే యొక రాగము. బాటలన్నియు లక్షణ సమన్వితములైన మార్గములు. అతడు నాదస్వరూపమును బూర్తిగా నవగాహనచేసికొని వివిధ రీతుల, గతుల, విన్యాసపు నడల, చమత్కారపు వరుసల బేర్చి, చేర్చి, కూర్చెను. ఒక్క మాటలో చెప్పవలెనన్న త్యాగరాజుని రచనలు నాదామృత రసగుళికలు.

## విశాల దృక్పథము

త్యాగరాజులో ననన్య సామాన్యమైన గుణ మొకటి చూడుడు : తాను సంప్రదాయ సిద్ధమైన కర్ణాటక సంగీత విదుషీమణి యయ్యు,

అన్య సంప్రదాయములకు జెందిన సంగీతముల వినుటయే గాక, యందలి స్వారస్యమును గ్రహించి, మనసున జీర్ణముగావించుకొని, తన సంప్రదాయముయొక్క ప్రాథమిక నియమోల్లంఘనము జేయక, యౌచిత్య భంగమేమాత్రము గాకుండ నన్య సంప్రదాయపు సంగీతము నందుగల యుత్కృష్ట భాగముల తన రచనలలో జూపజాలిన విశాల దృక్పథము గల్గిన మహా మేధావి.

ఆతనిచే రచింపబడిన పంచరత్నములు, నిజముగ, కర్ణాటక సంగీతమునకు త్యాగరాజుని యీవి. పాశ్చాత్య దేశీయుల "ఓపెరా" (Opera)లను బోలిన 'ప్రహ్లాద భక్తవిజయము' "నౌకాచరిత్రము" లను సంగీత నాటకముల రచించుటయందు త్యాగరాజు యప్పటికి,— బహుశాః, ఇప్పటికిని, నూతనమైన పంథా ననుసరించెను.

## అపూర్వ విషయము

నాకు—అనగా జంత్ర వాద్యకులందరకు,— సర్వదాపూజనీయమైన మరియొక విషయమును గురించి యొక్కమాట. అదేమన, తన కృతులలో సంగీతమును కేవలము సాహిత్యశృంఖలముల బంధించక, సాహిత్యము సంగీతపు పోకడ ననుగుణ్యముగ, చేదోడు వాదోడుగనుండునటుల యసమానప్రతిభతో రచించుటయే గాక, తక్కువ పదముల నెక్కువ భావమిమిడ్చియుండుటచే నోట వ్యక్త పర్చలేని కొన్ని భావములను, "నెరవు" రూపమున అవ్యక్తమధుర గానాలాపన జేయుట కవకాశమిచ్చెను. త్యాగరాజునకు విశ్వజనీన మార్గమును జూపిన గొప్ప శక్తులలో నిదియొకటి; అన్నిటికంటె ముఖ్యమైనది కూడను.

"లయ" విషయమునకూడ త్యాగరాజుని దృక్పథము సర్వజన విదితము, సుస్పష్టము. త్యాగరాజు చిన్నతనముననే లయ యందు గొప్ప పండితు డాయెను. ఐనప్పటికిని గాయకుని మనస్సు సంగీతోపాసన నుండి చెదర్పరాదు; అందువలన క్లిష్టమగు తాళముల నుపయోగించరాదు; భావ, రాగ, లయాదుల ప్రాముఖ్యత క్రమముగ పరిగణింప వలయునని యతని యభిప్రాయము. త్యాగరాజుని కీర్తనలలో చాలవరకు రూపకాది తాళముల జేయబడుటయే దీనికి దృష్టాంతము.

ఇట్టి సర్వతోముఖమైన శక్తివల్లనే యాతని రచనలు భాషాకృత పరిమితత్వమును జయించినవి. భాషావిగ్రహుడయ్యు, భాషను అతిగమించి రచించిన త్యాగరాజు ప్రతిభావంతుడు; అసమాన ప్రజ్ఞ, ఉపజ్ఞ కలవాడు. ఈతడు విశ్వజనీనమైన విశాలదృష్టి, సృష్టి రహస్యము నెఱుగజాలిన మేధస్సును, శతృవుల నయితము మన్నించి క్షమించగల హృదయనైర్మల్యము, శతాబ్దముల ముందుకు జూడగల దూరదృష్టి, సంగీతము యొక్క వివిధశాఖలలోని యుత్కృష్టతను జీర్ణించుకొని, వానిరసము పిండి యీయగల సూక్ష్మజ్ఞానము గల్గి, అమితానంద దాయకములైన తన రచనల రూపమున తన తెనుగు వారికిని, యావద్భారతదేశ ప్రజలకు మాత్రమే గాక, విశ్వమానవకోటి కెల్లను భక్తి, శాంతి, సౌఖ్యమను సందేశమిచ్చిన మహాపురుషుడు. అతనికీర్తి పలుదిశావ్యాప్తమైనది; ఇంకను యగుచున్నది. ఆతని ప్రతిభ భారత విజ్ఞానమునకే యొక అపూర్వ నిదర్శనము !

ఆతనికి మనహృదయ పూర్వక జోహారులు.

Source: A.P. Press Academy Website, Navodaya Patrika 1947

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan